# సహనావవతు

సత్యం చచ్చిపోయేడు.

స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న కుర్రాడు వాడు.

చెరువులో పడి చచ్చిపోయేడు. ఈత కొడదామని వెళ్ళాట్ట. ఈతరాక, మునిగి చనిపోయేట్ట. స్కూలుకి శలవు ఇచ్చేశారు. నా గుండె పిరికిగా కొట్టుకుంది. నా మనసు వికలమైపోతోంది.

''వాడి కసలు ఈత రాదుటండీ''.

''ఈతరాని వెధవ అసలు చెరువు కెందుకెళ్ళాడు''.

''పోనీ, ఎవరినయినా తోడుతీసుకుని వెళ్ళకూడదూ?''

''ఒక్కడూ వెళ్ళి చెర్లో పడి చచ్చేడు.''

''ఆయుష్షు తీరింది. అందుకే అలాంటి బుద్ధి పుట్టింది.''

''బుద్ధిః కర్మానుసారిణి అని...''

''జాతస్య మరణం ధృవమ్. కానయితే ముక్కు పచ్చలారని వయసులో పోయేడు పాపం.''

''లలాటలేఖో నపునః ప్రయాతి...''

'' సర్లెండి కానీ, ఎలాగూ శలవు దొరికింది కదా, సిటింగు వేసేస్తే - ''

''టవును వెళ్ళి సామాన్లు తెచ్చుకోవాలండీ''.

''టవున్లో కొత్త మేట్నీ సినిమాలేమిటో ?''

నేను మాత్రం మవునంగా నడుస్తున్నాను. భయంతో, ఆవేదనతో నా హృదయం పిడచకట్టుకుపోతోంది. నా నరనరమూ తెలియని తొట్రుపాటుతో కంపించిపోతోంది.

సత్యం చచ్చిపోయేడు!

వాడి చావు నిజంగా ప్రమాదవశాత్తు జరిగిందేనా ?

నా మనసు దహించుకుపోతోంది.

నేను.. నేను మనిషిని కాను.

నాకు మానవత్వం లేదు. అమాయకుడయిన సత్యం చావుకి నేనే కారణం. ఇది నా మనసుకి తెలుసు. లోకానికి తెలీదు. ఇప్పటికే కాదు ఎప్పటికీ తెలియదంతే.

కొన్ని రకాల చావులంతే. ఎవరికీ అంతు చిక్కని విధంగా అమాయకంగా, అనామకంగా, చచ్చిపోతారు. కాని ఆ చావు వెనుక భయం కరమయిన నిజం ఒకటి ఉంటుంది.

దుర్భర సత్యం ఒకటి దాగి ఉంటుంది.

కాని శరీరం మీద అలాంటి కనిపించని మచ్చలెన్నో!

రేపు మళ్ళీ మామూలుగానే తెల్లవారుతుంది. మామూలుగానే బడి తెరుస్తారు.

ప్రార్థన జరుగుతుంది. అది సత్యం ఆత్మశాంతి కోసం కాదు. నిజమయిన భక్తి ఉండబట్టి కాదు. అదొక అలవాటు. రొటీన్ అంతే.

రిజిస్టరు నుంచి సత్యం పేరు తొలగించబడుతుంది.

పాఠాలు మామూలుగానే జరుగుతాయి. మేష్టర్లు పాఠాల గురించీ, పేస్కేల్సు గురించీ మాట్లాడుకుంటూనే ఉంటారు. క్రమంగా సత్యం స్మృతులు తుడిచి పెట్టుకపోతాయి.

నా తల ఆలోచనలతో వేడెక్కి దిమ్మెత్తి పోయింది.

* * *

భోజనం సహించలేదు. ఏదో తిన్నాననిపించి చెయ్యి కడుక్కుని లేచిపోయేను.

అదేమని అడగలేదు జానకి. నా నిర్లిప్తత తనకి అలవాటే. ఇంట్లో ఎవరికెవరం ఏమీ పట్టనట్లుండటం మా కలవాటే. కల్యాణి నావేపు అదోలా చూసి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది. రామం ఇంట్లో లేడు. శీను, వెంకట్రమణలు ఆడుకోడానికి కాబోలు వీధిలోకి పరుగెత్తి పోయారు.

నిస్త్రాణగా కళ్ళు మూసుకుని మంచంమీద వాలిపోయేను.

ఇంటి పరిస్థితి రోజు రోజుకీ దిగజారిపోతోంది.

కల్యాణికి వోణీలు వేసుకునే వయసొచ్చింది. చిరిగిన వోణీలతో బిక్కుబిక్కుమంటూ అది నా ముందు తిరుగుతూ ఉంటే నా మీద నాకే అసహ్యం, జాలి కలుగుతూ ఉంటాయి.

అరుంధతి పెళ్ళికి చేసిన అప్పు అలాగే ఉంది. వడ్డీలు కట్టలేక నా ప్రాణం కడతేర్చుకుపోతూంది.

పెద్దవాడు రామం మెట్రిక్ పాసై ఆ సర్టిఫికేట్‌తో ఏం చెయ్యాలో తోచక దర్జీ పని నేర్చుకుంటున్నాడు.

వాడి తరవాతి వాడు శంకరం ఇల్లొదిలి పారిపోయేడు. వాడికోసం వెదకని రోజులేదు. తల్చుకొని తల్చుకొని జానకి రోజూ ఒకటే ఏడుస్తుంది.

పగలంతా క్షణం తీరిక లేకుండా చాకిరీ చేస్తుంది. రాత్రి చెంగు పరుచుకుని కటిక నేల మీద పడుకుని ఏడుస్తూ ఉంటుంది. ఏమిటో దాని పిచ్చి. దాని ఆరోగ్యం మరింత క్షీణించిపోవడం తప్పితే అదలామొండిగా

ప్రవర్తిస్తే మాత్రం వాడు తిరిగొస్తాడా?

అర్థరాత్రి వేళ మెళుకువ వచ్చినప్పుడు- జానకి సన్నని ఏడుపు - ఆ నిశ్శబ్దంలో నా గుండె జలదరిస్తూ ఉంటుంది.

''జానకీ...' పిలుస్తాను. అంతకుమించి ఆమెను ఎలా వోదార్చాలో నాకు తెలీదు.

జానకి పలకదు. కనీసం తన వేపు చూడదు. కొంతసేపటికి ఆమె వెక్కిళ్ళు ఆగిపోతాయి.

నా గుండె దిగులుగా, భారంగా అయిపోతుంది.

ఈ జీవితం ఇరుగ్గా ఉంది. ఈ జీవితం దుర్భరంగా ఉంది.

ఎవరినో అడిగి తెచ్చుకున్న వారపత్రికలో సినిమా తారలు కట్టుకున్న అందమయిన చీరల వేపు ఆశగా ఆబగా చూస్తూ- ఒక్కోసారి పిలిచినా పలక్కుండా ఉండి పోతుంది కల్యాణి.

ఏం ఆలోచిస్తూ ఉంటుందో ?

దాని మవునం నన్ను వెంటాడి బెదిరిస్తూ ఉంటుంది.

నవ్వుతూ తుళ్ళుతూ తిరగాల్సిన ఆ వయసులో- ఆ పిల్ల అంత అనాసక్తంగా నిర్లిప్తంగా ఉండడం ఎంత ఘోరం!

పెద్దవాడు ఏ రాత్రికో వచ్చి, ఇన్ని మెతుకులు కొరికి మంచం మీద పడి నిద్రపోతాడు.

వాడి భవిష్యత్తు అంతేనా?

అంతేమరి. జీతాలు కడుతూ, పుస్తకాలు కొని, వేరే వూళ్ళో చదివించడం నా తలకి మించిన పని. నా మీద కోపం వాడు తల్లి మీద, తమ్ముళ్ళమీద చూపిస్తూ ఉంటాడు.

శీను, వెంకట్రమణలు నేను పనిచేసే స్కూల్లోనే చదువుతున్నారు. వెంకట్రమణ జబ్బు చేసి ఒక సంవత్సరం వెనుక పడ్డాడు. ఇద్దరూ ఏడో తరగతిలోకి వచ్చేరు.

ఆ తరగతికి టీచర్ని నేనే. నేను చెప్పే పాఠాలు వాళ్ళు సరిగా వింటున్నట్టు కనిపించరు. సందేహం లేదు. వాళ్ళకి నా మీద చులకన భావం. వాళ్ళకి పాఠాలు చెప్పడం నా తరం కావడం లేదు. ఉద్యోగ రీత్యా నేనిలా అనడం సబబు కాదు. కాని... నేను వోడిపోతున్నాను.

పరిస్థితులకి తట్టుకోలేక దారుణంగా వోడిపోతున్నాను.

సైన్సు పాఠం చెప్పేటప్పుడు-

''మనం పౌష్టికాహారం తీసుకోవాలి. తినేటప్పుడు బాగా నమిలి తినాలి. మన శరీరానికి ఎన్నో విటమిన్లు అవసరం...''

పాఠం మధ్యలో ప్రశ్న వేస్తాడు శీను- ''పౌష్టికాహారం అంటే ఏమిటండీ?''

నా మెదడులో ఏదో పేగు కలేల్మన్నట్టు-

ఆ ప్రశ్న సూటిగా వచ్చి నా గుండెని తాకుతుంది.

"ఎప్పుడూ ఈ పచ్చడి మెతుకులేనా!" అని ఇంటి దగ్గర వాళ్ళమ్మ మీద అలిగి, భోజనం దగ్గర నుంచి లేచిపోతే- కోపంతో వాడినడ్డి ఫెడీల్మని పించేనేను-

వెంకట్రమణ జబ్బులో వాడికి రోజూ ద్రాక్ష బత్తాయిలు ఇమ్మని డాక్టరు చెప్పినప్పుడు- ప్రతిరోజూ వాటిని కొనే శక్తి చాలక ఒక్కో రోజు పళ్ళు లేవనే, సాకు చెప్పి, తప్పించుకోడానికి ప్రయత్నించిన నేను-

వాడికేం జవాబు చెప్పగలను ?

ఇక్కడ తండ్రిగా కాదు! టీచరుగానైనా వాడికేదో జవాబు చెప్పాలి కద! నేను చెప్పేది విని- వాడు చూసే అదో విధమయిన చూపులని భరించే శక్తి నాకు లేదు గాక లేదు!

స్కూలు ఇనస్పెక్షన్కి పిల్లల్ని మంచి బట్టలు వేసుకుని రమ్మని హెడ్మాస్టరు నోటీసు పంపిస్తే ఆ నోటీసుక్లాసులో చదివి చెప్పేటప్పుడు నా గొంతు ఎందుకో సన్నగా వణుకుతుంది. నా స్వరంలో జీర నాకే వెగటుగా, అసహ్యంగా తోస్తుంది.

నాకు తెలుసు. ఈ వృత్తి అన్ని ఉద్యోగాలవంటిదీ కాదు. ఈ వృత్తి చేపట్టిన వ్యక్తికి మనసు నిర్మలమయినదీ, పక్షపాతం లేనిదీ అయి ఉండాలి. సహనం, సమభావం అవసరం.

కాని... అవన్నీ మాటలే. ఆదర్శాలే. ఉపాధ్యాయులు కూడా మనుషులే . ఈ దివాళా కోరు సమాజంలో అదిపోయే వికారపు పోకడలకూ అది కల్పించే నైతిక పతనాభ్యుదయాలకూ ఎంత ఉన్నత వ్యక్తిత్వమయినా లొంగిపోక తప్పదు. క్రుంగిపోక తీరదు.

ఈ రకమయిన మనస్థితిలో -

సత్యం- అర్థం లేని అసూయ, అసహజమైన వైషమ్యాలకు కారణమయాడు.

వాడు వెనుకబడిన కులాలకు చెందినవాడు. సోషల్వెల్ఫేర్ హాస్టల్లో ఉండి చదువుకుంటున్నాడు. నిజానికి వాడిని నేను ద్వేషించడంలో అర్థం లేదు. వాడు పేదరికంలో పుట్టి పెరిగాడు. వాడింట్లో దరిద్రం తాండవిస్తూంది.

కాని.. కాని వాడి చదువుకి అడ్డులేదు. దీనివల్ల తిండికీ లోటులేదు. బట్టలు, పుస్తకాలు, పైపెచ్చు స్కాలర్షిప్స్ అన్నీ లభిస్తున్నాయి. అగ్రకులాలకి చెందిన వాళ్ళనే కారణం వల్ల మా వెధవలకా అవకాశాలు పూజ్యం.

ఒకే తరగతిలో ఉంటూ సత్యం కంటె దీనావస్థలో నా పిల్లలు ఉండడం నాకు భరించరాని వేదన కలిగించింది.

ఈ ఆలోచన ఎంత కుటిలమైనదో నేనెరుగుదును.

కాని - నా మనసు - నా బుద్ధిమీద, విచక్షణా జ్ఞానం మీద తిరుగుబాటు చేసింది. నేను వివేకం

కోల్పోయాను. ఇది కోల్డ్‌వార్. ఈ సంఘర్షణ నన్ను రాక్షసుడ్ని చేసింది.

నా పిల్లలు తిండికీ బట్టకీ వాచిపోతున్నారు. వాళ్ళకి పుస్తకాలు కూడా సరిగా కొనివ్వలేని స్థితి నాది.

కాని ... సత్యం?

వాడి చదువుకి బాధలేదు. భవిష్యత్తుకి బెంగలేదు. ఈ ఆలోచన నాలో ఎప్పుడు చోటుచేసుకుందో కానీ, అప్పటి నుంచి నాలో అనూహ్యమయిన కఠినత్వం ఘనీభవించి నాలో మానవత్వాన్ని హరించి వేసింది. నా పిల్లలకి నేను సమాకూర్చలేకపోతున్నవన్నీ వాడికి అయాచితంగా వస్తున్నవనే ఆలోచనని భరించలేకపోయాను.

నాకు తెలీకుండానే సత్యం పట్ల ద్వేషం పెరిగింది.

వెనుకబడిన కులాలకు చెందిన పిల్లలు ఇంకా మరి కొంత మంది ఉన్నా, నాకు సత్యం మీదే ఎక్కువ ద్వేషం ఎందుకేర్పడిందో చెప్పలేను. బహుశా వాడు మా శీను కన్నా తెలివయిన వాడనే కారణం కావచ్చును.

ఏదో వంకపెట్టి సత్యాన్ని దండించడం మొదలుపెట్టాను. వాడు నన్ను చూస్తేనే జడుసుకునేలా తయారయేడు. నేను క్లాసులో అడుగుపెట్టగానే వణికిపోయేవాడు.

ఒక వికసించే పుష్పాన్ని నిర్దాక్షిణ్యంగా నలిపేస్తున్నాననే ఆలోచన కూడా నాకు రాలేదు. వాడినలా హింసించడంలో నాకేదో తృప్తి లాంటిది కలిగేది. నా తీరని సమస్యలకది వూరట కలిగించే చర్య అనుకుంటాను?

రాను రాను సత్యంలో చురుకుదనం నశించింది మందకొడిగా, స్తబ్దుగా తయారయేడు.

మూడు రోజుల క్రితం స్కూల్లో -

ప్రార్థన వాడు సరిగా చదవకపోవటం గమనించాను. క్లాసులో అందరి ముందూ అనరానిమాటలని దండించాను. రెండురోజుల్లో ఆ ప్రార్థన శ్లోకాలన్నీ తప్పులేకుండా ఉచ్చరించగలగడం నేర్చుకోకపోతే ప్రాణం తీస్తానని భయపెట్టాను.

ఆరోజు నాకేం దెయ్యం పట్టింది ?

ఏ కారణం వల్ల ప్రభుత్వం వాళ్ళకా సదుపాయాలు కలుగజేస్తుందో- ఆ వెనుకబడినతనం వల్లనే- ఆ సంస్కార హీనత చేతనే- ఆ పెరిగిన వాతావరణ పరిస్థితుల వల్లనే వాడి ఉచ్చారణ, భాష లోప భూయిష్ఠంగా ఉందనే నేనెందుకు గ్రహించలేకపోయేను?

అది సహృదయంతో అర్థం చేసుకుని సానుభూతితో సరిదిద్దవలసిన బాధ్యత నా మీద లేదూ!

నా సంస్కారం ఏ మంటల్లో దగ్ధమైపోయింది ?

నా మానవత్వం ఎప్పుడు నశించిపోయింది? ఇంతలా రాక్షసుడి నయిపోయానేం నేను!

ఆ తరువాత సత్యం స్కూలుకి రాలేదు. ఎవరూ ఆ విషయం అంతగా పట్టించుకోలేదు.

ఇవాళ...

పిడుగులాంటి వార్త! సత్యం చచ్చిపోయేడు.

నా మెదడు పగిలిపోతోంది. నా పాపం నన్ను పిచ్చివాడ్ని చేస్తోంది.

* * *

మరునాటి ఉదయం - గణగణమని గంట కొట్టేరు.

పిల్లలంతా బిలబిలమంటూ స్కూలు గ్రౌండులోకి పరుగెట్టారు. టీచర్లంతా ఓ వరుసలో నించున్నాం.

ప్రార్థన మొదలయింది.

''సహనానవతు సహనౌభునక్తు

సహవీర్యం కరవావహై

తేజస్వినానధీ తమస్తు

కళా విద్విషావహై .. సహనౌయశః...'' అంటూ పిల్లలంతా ముక్త కంఠంతో చదువుతున్న ఆ శాంతి పాఠం వినడానికి నాకు ధైర్యం చాలింది కాదు.

నా ఒంట్లో సన్నని వణుకు మొదలై, నా కళ్ళ ముందు చీకటి ఆవరిస్తోంది.

(ఆంధ్రప్రభ. సచిత్రవారపత్రిక. 12.12.1979)